

రాణించిన కర్నూలు బ్యాట్స్‌మన్

కడపలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో కర్నూలు బ్యాట్స్‌మన్ రాణించారు. -8లో



పర్మినెంట్ లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం

పర్మినెంట్ లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయ పరిష్కారం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.అన్నపూర్ణ పేర్కొన్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
36.3/27.2

వాతావరణం

జిల్లాలో శనివారం 27.2 - 36.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 9.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

విధుల్లో చేరిన డీటీసీ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: వ్యక్తిగత సెలవుపై నెల రోజుల పాటు సెలవుపై వెళ్లిన మీరా ప్రసాద్ శనివారం తిరిగి విధుల్లో చేరారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ డీటీసీగా చిత్తూరు డీటీసీ నిరంజన్ రెడ్డి వ్యవహరించారు.

యువతలో నైపుణ్యం పెంపొందించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్

కడప కోటిరెడ్డిసర్కిల్: యువతలో నైపుణ్య విలువలను పెంపొందించాలని, దీనివల్ల అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్ తెలిపారు. శనివారం ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవాన్ని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ నాయక్ మాట్లాడుతూ ప్రపంచం సుస్థిర అభివృద్ధి వైపు మళ్లుతున్న నేపథ్యంలో యువతలో నైపుణ్యం పెంపొందించాల్సి అవసరం ఉందన్నారు.అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జేడీఎం వేణు మాధవ్, గోపి, నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ఎండీ ఇంతియాజ్ అహ్మద్‌తో పాటు సుబ్బరామిరెడ్డి, తేజ, నరసింహా, అలీ, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



మినిస్టీరియల్ ఉద్యోగుల నూతన కార్యవర్గం

కడప సెవెన్‌రోడ్స్: కలెక్టర్ (పంచాయతీల విభాగం) మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం జిల్లా పంచాయతీ అధికారి బి.ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.వెంకట సుబ్బయ్య, ఉపాధ్యక్షుడిగా సునీల్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.అనిల్‌కుమార్, కార్యదర్శిగా డి.హెప్సిబా, సంయుక్త కార్యదర్శిగా డి.రామచంద్ర, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా టి.జోయల్ దివాకర్, ఎ.గౌరి, కోశాధికారి ఎస్.ఎజాస్ అహ్మద్, అసోసియేషన్ సభ్యులుగా ఎస్.విజయలక్ష్మి, వై.విజయభారతి, జె.నరసింహాప్రసాద్, ఎస్.రామకృష్ణ, జి.ఓబులేశు, సి.మాధవి, జెడ్.అజిత్ డేవిడ్‌రాజ్, ఎస్.ఆషి, ఎస్.అస్రఫ్, డి.భవానీ, పి.శతాజ్‌భానులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రూ.2 కోట్లతో 42 బస్టాండ్లలో మరమ్మతులు



బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ కడప ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు

పీలేరురూరల్: రూ. 2 కోట్లతో 8 జిల్లాల్లో 42 ఆర్టీసీ బస్టాండ్లలో మరమ్మతులు చేపట్టనున్నట్లు ఆర్టీసీ కడప ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది మే నెల వరకు ఆర్టీసీ రూ. 61 కోట్ల నష్టాల్లో ఉందన్నారు. గత ఏడాది రూ. 160 కోట్లు నష్టం రాగా, ఈ సారి నష్టాలను తగ్గించామన్నారు. ఆర్టీసీ రాష్ట్రంలో కొత్తంగా 1500 బస్సులు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. కార్గో సేవలు మరింత విస్తృతం చేస్తామన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెలా మూడో శుక్రవారం గ్రీవెన్స్‌డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎం రాము, డీఎం కుమార్, సీఐ సుబ్బమ్మ, ఎస్టీఐ బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు అమృత్ యోగం

- జిల్లాలో 91 చెరువుల అభివృద్ధి పనులు
- జిల్లాకు అమృత్ సరోవర్‌లో నాలుగో స్థానం
- ఉపాధి, వాటర్‌షెడ్, నీటిపారుదలశాఖ ద్వారా పనులు

కడప సిటీ : ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా దేశంలో ఉన్న ప్రతి జిల్లాలో కనీసం 75 చెరువుల నిర్మాణం, పునరుద్ధరణ పనులు చేపట్టాల్సి ఉంది. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా గతేడాది ఏప్రిల్ 24వ తేదీన పంచాయతీరాజ్ దినోత్సవ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ అమృత్ సరోవర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ విధానం ద్వారా చెరువుల్లో బౌండరీల నిర్మాణం, పూడికతీత పనులు, కంపచెట్ల తొలగింపు, మొక్కలు నాటడం, అవసరమైనచోట్ల కొత్త చెరువుల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. చెరువుల అభివృద్ధి పనుల వల్ల ఆయా ప్రాంతాల్లో సాగునీరు, భూగర్భ జలాల పెంపు, తాగునీటి అవసరాలు తీరే అవకాశం ఉంటుంది. స్వాతంత్య్రం సిద్ధించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ అమృత్ సరోవర్ ను చేపట్టారు. ఇందులో 10,000 క్యూబిక్ మీటర్ల నిల్వ సామర్థ్యంతో ఒక ఎకరం చెరువు ప్రాంతం ఉండేలా కొత్త చెరువుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇందులో చేపట్టిన చెరువుల నిర్మాణం, పునరుద్ధరణ పనులు ఆగస్టు 15, 2023 నాటికి పూర్తి చేయాల్సి ఉంది. వైఎస్సార్ జిల్లాలో 75 చెరువులు అభివృద్ధి చేయాల్సి ఉండగా, అంతకుమించి 91 పూర్తయ్యాయి. 130 చెరువులకు పరిపాలన అనుమతులు వచ్చాయి. మిగిలిన వాటి పనులను పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు.

- ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అమృత్ సరోవర్ పేరిట కొత్త చెరువుల నిర్మాణం, పాతవి పునరుద్ధరించే పనులు జిల్లాలో చేపట్టారు. 75 చెరువుల పనులు చేయాల్సి ఉండగా, అంతకుమించి 91 పూర్తి చేశారు. మొత్తం 130 చెరువులకు పరిపాలన అనుమతులు రాగా, మిగిలిన వాటిని గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ముందుకు సాగుతున్నారు.



పెద్దకాంపల్లిలోని చెరువులో పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

మూడు విధానాల ద్వారా...

అమృత్ సరోవర్‌లో కొత్త చెరువుల నిర్మాణం, పునరుద్ధరణ పనులను మూడు విధానాల ద్వారా చేపడుతున్నారు. ఉపాధి, వాటర్‌షెడ్, నీటి పారుదలశాఖ ద్వారా ఈ పనులను జిల్లాలో నిర్వహించారు. వాటర్‌షెడ్, నీటిపారుదలశాఖల ద్వారా జరిగిన చెరువుల అభివృద్ధి పనులకు యంత్రాలతో పనులు నిర్వహించేందుకు వెసులుబాటు ఉంటుంది. ఉపాధిహామీ పథకంలో కేవలం కూలీలతో మాత్రమే పనులు నిర్వహిస్తారు

ఏ శాఖలో ఎన్నెన్ని..

జిల్లాలో అమృత్ సరోవర్ ద్వారా వాటర్‌షెడ్ కింద 18 కొత్త చెరువుల నిర్మాణాన్ని చేపట్టారు. ఉపాధి హామీ ద్వారా 64 , ఇరిగేషన్ ద్వారా 9 చెరువుల పునరుద్ధరణ పనులను నిర్వహించారు. చెరువుల్లో బౌండరీల నిర్మాణం, కట్ట భద్రత, పూడికతీత పనులు, కంపచెట్ల తొలగింపు తదితర పనులను చేశారు.



నందిపల్లెలోని చెరువులో అమృత్ సరోవర్ ద్వారా చేసిన అభివృద్ధి పనులు

- ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాల్లో వైఎస్సార్ జిల్లాకు అమృత్ సరోవర్‌లో భాగంగా చెరువులు అభివృద్ధి చేసినందుకు నాలుగోస్థానం దక్కింది. 75 అభివృద్ధి పనులు చేయాల్సి ఉండగా, 91 పూర్తి చేసింది. భూగర్భ, నీటిపారుదల, గ్రామీణ నీటిపారుదల శాఖల అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి ఈ పనులను పర్యవేక్షించారు. అన్నిచోట్ల పనులు సక్రమంగా జరిగినట్లు బృందాలు తెలియజేశారు.

చెరువుల అభివృద్ధి పనుల వివరాలు

నియోజకవర్గం	ఉపాధిహామీ	వాటర్‌షెడ్	ఇరిగేషన్	అనుమతులు	పూర్తయినవి
బద్వేలు	14	06	00	32	20
జమ్మలమడుగు	10	02	00	16	12
కడప	00	00	04	04	04
కమలాపురం	13	02	00	20	15
పులివెందుల	13	06	03	29	22
రాజంపేట	05	00	02	09	07
మైదుకూరు	09	02	00	20	11
మొత్తం	64	18	09	130	91

ఎన్నో ప్రయోజనాలు



అమృత్ సరోవర్ పథకం ద్వారా జిల్లాలో దాదాపు 91 చెరువులను అభివృద్ధి చేసేందుకు వీలు కలిగింది. దీని వల్ల ఆయకట్టుకు నీరు, భూగర్భ జలాల పెంపు, ప్రజల అవసరాలకు తాగునీరు పుష్కలంగా ఉండేందుకు అవకాశం ఏర్పడింది. జిల్లాను అమృత్ సరోవర్‌లో నాలుగోస్థానంలో నిలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.

– యదుభూషణరెడ్డి, పీడీ, డ్వామా, కడప

18న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ సీ-డ్యాప్ సంయుక్తాధ్వర్యంలో ఈనెల 18వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో జాబ్‌మేళా జరగుతుందన్నారు. సెంచరీ ఫ్లైవుడ్ కంపెనీలో హైడ్రాలిక్ ఇంజినీరు, అసిస్టెంట్ ఇంజినీరు, టెక్నీషియన్, ఎలక్ట్రీషియన్, ఆపరేటర్స్, సూపర్‌వైజర్లు, ఇన్‌చార్జిలు, ఫ్లిప్ కార్ట్ కంపెనీలో డెలివరీ అసోసియేట్, ఎయిర్ డిక్సన్ టెక్నాలజీస్‌లో అసెంబుల్ ఆపరేటర్స్, నవత ట్రాన్స్‌పోర్టులో క్లర్క్‌లు, డ్రైవర్లు, క్లీనర్లు తదితర ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు విద్యార్హతలకు సంబంధించిన ధృవపత్రాలు, ఫోటోలు తీసుకుని రావాలన్నారు.

పరికరాలను సకాలంలో అందించాలి



మాట్లాడుతున్న ఏపీ ఎంఐపీ పీడీ రవీంద్రనాథరెడ్డి

కడప అగ్రికల్చర్: జిల్లాలో బిందు, తుంపర సేద్యం పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు సకాలంలో వాటిని అందించాలని ఏపీ ఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం కడపలో మైక్రో ఇరిగేషన్ అధికారులకు, కంపెనీ జిల్లా కో ఆర్డినేటర్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం 8 వేల హెక్టార్లు లక్ష్యంగా నిర్దేశించగా 9982 హెక్టార్లకు బిందు, తుంపర పరికరాలు మంజూరు చేశారన్నారు. అలాగే 2023-24 ఏడాదికి 10,500 హెక్టార్లు లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 1335 హెక్టార్లకు జిల్లా కలెక్టర్ ద్వారా పరికరాలను మంజూరు చేసినట్లు చెప్పారు. పరికరాలు మంజూరైన రైతులకు మైక్రో ఇరిగేషన్ కంపెనీ వారు తక్షణం డ్రిప్పు పరికరాలను ఏర్పాటు చేయాలన్నారు.

పసుపు ధర పైపైకి



- రైతుకు కాసులు కురిపిస్తున్న పంట
- క్వింటా రూ. 7918
- మార్క్‌ఫెడ్ ద్వారా 1916 మెట్రిక్ టన్నుల కొనుగోలు

కడప అగ్రికల్చర్: పసుపు ధరలు బహిరంగ మార్కెట్‌లో రోజురోజుకు ఎగబాకుతుతన్నాయి. దీంతో రైతులకు కాసుల పంట పండుతోంది. ఈ ఏడాదిలో ఈ నెల 12,13,14 తేదీల నుంచి పసుపు రేటు భారీగా పెరుగుతూపోతోంది. 12వ తేదీ క్వింటా ఫింగర్(కట్ట కొమ్ము) ధర రూ. 7459 పోగా క్వింటాల్ బల్బ్(ఉంట కొమ్ము) ధర రూ. 7 వేలు పోయింది. 13వ తేదీన క్వింటా ఫింగర్ ధర రూ. 7745, బల్బ్ ధర రూ. 7112 ఉంది. 14వ తేదీ క్వింటా ఫింగర్ ధర రూ. 7918, బల్బ్ ధర రూ. 7414 పోయింది. ఇలా రోజురోజుకు ధర పెరుగుతుండటంతో అన్నదాతల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

జిల్లాలో 4783.500 ఎకరాల్లో పసుపుసాగు...

జిల్లావ్యాప్తంగా 2022-23 ఏడాదిలో పోరుమామిళ్ల, సిద్దవటం, ఖాజీపేట, మైదుకూరు, పెండ్లిమర్రి, జమ్మలమడుగు, దువ్వూరులతోపాటు పలు మండలాల పరిధిలో 4122 మంది రైతులు 4783.500 ఎకరాల్లో పసుపు సాగు చేశారు. 16120 మెట్రిక్‌టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అయితే పసుపు కొనుగోలు ప్రారంభంలో క్వింటా ధర 4000 వేలనుంచి రూ. 4600 ఉండేది. దీంతో చాలా మంది రైతులు తమ పసుపును బహిరంగ మార్కెట్‌లో అమ్మకుండా స్టాక్ ఉంచుకున్నారు. ప్రభుత్వం కల్పించుకుని రూ. 6850 మద్దతు ధరను ప్రకటించింది. దీంతో చాలా మంది రైతులు పసుపును మార్క్‌ఫెడ్ వద్ద అమ్ముకున్నారు. ప్రారంభంలో క్వింటా ధర రూ. 4 వేలు ఉంటే ప్రభుత్వం రూ. 6850గా ప్రకటించడంతో రైతులు వ్యాపారులకు పసుపును అమ్మేందుకు ఆసక్తి చూపలేదు.దీంతో వ్యాపారులు కూడా రేటు పెంచాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా ఫింగర్ ధర రూ.7918, బల్బ్ ధర క్వింటా రూ. 7414 పలికింది. ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి.



అమ్మకాల కోసం మార్కెట్‌యార్డులో సిద్ధం చేసిన పసుపు కొమ్ములు

ప్రభుత్వ మద్దతు ధరతోనే పెరిగిన రేటు...

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ప్రభుత్వం పసుపుకు రూ.6850 మద్దతు ధర కల్పించింది. రైతులు పండించిన పసుపును మార్క్‌ఫెడ్ ద్వారాకొనుగోలు చేసేందుకు జిల్లాలో ఆరు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది జూన్ 2వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 890 మంది రైతులు నుంచి 1916 మెట్రిక్ టన్నుల పసుపును కొనుగోలు చేసింది. ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించి పసుపు కొనుగోలు చేయడంతో పసుపు వ్యాపారులు కూడా బహిరంగ మార్కెట్‌లో పసుపు ధరను పెంచాల్సి వచ్చింది. దీంతో రైతన్నలకు మేలు జరిగింది.

కడప మార్కెట్‌యార్డులో పసుపు అమ్మకాల వివరాలు....

నెల	రకం	కొనుగోలు చేసిన పసుపు (క్వింటాల్లో)	కనీసధర (రూ.లలో)	అధిక ధర (రూ.లలో)
జనవరి	ఫింగర్	1506	3025	5785
	బల్బ్	1412	3050	6090
ఫిబ్రవరి	ఫింగర్	1209	2600	5922
	బల్బ్	448	2222	5439
మార్చి	ఫింగర్	5833	3000	6008
	బల్బ్	2346	2572	5689
ఏప్రిల్	ఫింగర్	10696	2300	5812
	బల్బ్	4149	2512	5555
మే	ఫింగర్	10822	3489	6312
	బల్బ్	3822	3699	5942
జూన్	ఫింగర్	7149	3119	6562
	బల్బ్	2290	2858	6262
జూలై	ఫింగర్	1205	3012	7245
	బల్బ్	518	4250	6668

ధర మరింత పెరిగే అవకాశం



గడిచిన మూడేళ్లుగా మార్కెట్‌లో ధర లేదు. అందుకే మార్క్‌ఫెడ్ మార్కెట్‌లో జోక్యం చేసుకుని కొనుగోలు చేసింది. క్వింటా మద్దతు ధర రూ.6,850గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ధర కంటే తక్కువగా ఏ ఒక్కరూ అమ్ముకోవద్దు. ధర మరింత పెరిగే అవకాశం ఉంది.

– బాల వెంకటరెడ్డి, మార్కెట్‌యార్డు సెక్రటరీ, కడప

మాదక ద్రవ్యాల నిరోధానికి పటిష్ట చర్యలు

కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలు, రవాణా అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో జాయింట్ యాక్షన్ కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌తో కలిసి కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, వర్కర్లను లక్ష్యంగా చేసుకుని సరఫరా జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. మాదక ద్రవ్య విక్రయాలు జరిగే చోట గట్టి నిఘా ఉంచాలన్నారు. మాదక ద్రవ్యాల బారిన పడిన బాధితుల పట్ల సున్నితంగా వ్యవహరించాలని పోలీసుశాఖకు పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. రిమ్స్ ప్రాంగణంలోని సఖి సెంటర్‌లో డి-అడిక్షన్ సెంటర్‌ను నిత్యం అందుబాటులో ఉంచాలన్నారు.

- జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్ట పరిచి మరింత విస్తృత పరచాలని కలెక్టర్ విజయరామరాజు డీఐఈపీసీ సభ్యులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో జిల్లా పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశంలో మాట్లాడుతూ పరిశ్రమలే జిల్లా ఆర్థిక ప్రగతికి ప్రధానమని చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని చెప్పారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలను ప్రోత్సహించాలని పరిశ్రమలశాఖ అధికారులు, బ్యాంకు అధికారులకు స్పష్టం చేశారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ 2015-20, 2020-23లను అనుసరించి జిల్లాలో అన్ని సెక్టార్లలోని 28 యూనిట్లకు రూ. 1.43 కోట్ల రాయితీ మొత్తం విడుదలకు కమిటీ ఈ సందర్భంగా ఆమోదం తెలిపింది. పరిశ్రమలశాఖ జీఎం జయలక్ష్మి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి, ఎల్‌డీఎం దుర్గాప్రసాద్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి, కార్మికశాఖ, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులు పాల్గొన్నారు.
- గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఎస్‌హెచ్‌జీల ద్వారా రూ. 35 వేల రుణాలను వెంటనే మంజూరు చేయాలని కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. శనివారం ఇక్కడ ఆయన మాట్లాడుతూ బేస్‌మెంట్ లెవెల్‌లో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్లను పూర్తి చేయాలన్నారు. జగనన్న పాలవెల్లువ కింద పులివెందులలోని అన్ని మండలాలతోపాటు పెండ్లిమర్రి, వీఎన్ పల్లెకు కేటాయించిన పాల సేకరణ లక్ష్యాలు సాధించాలన్నారు. ఈ సమావేశంలో ఉన్నతి కార్యక్రమం కింద ఎస్సీ ఎస్టీ, టీఎస్‌పీ కాంపోనెంట్స్‌పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

20న ప్రొద్దుటూరుకు హోం మంత్రి రాక



ప్రొద్దుటూరు: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఈనెల 20న ప్రొద్దుటూరుకు రానున్నారు. అమృత్ తాగునీటి పథకం , రాచమల్లు రాజన్న భోజనం, మున్సిపల్ పార్కును ప్రారంభిస్తారు. మైదుకూరు రోడ్డులో స్మార్ట్ స్ట్రీట్ పనులకు భూమి పూజ కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమాలకు హోం మంత్రితోపాటు రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరు కానున్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాదరెడ్డి శనివారం ఈ విషయాన్ని తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం రిమ్స్ పోలీసుస్టేషన్ పరిధిలోని అర్కేనగర్‌లో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి రూ.8680 నగదు, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని రిమ్స్ ఎస్ఐ నారాయణ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

13 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

డీఈఓ రాఘవరెడ్డి

సిద్దవటం : మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 13 మంది ఉపాధ్యాయులకు శనివారం షోకాజ్ నోటీసులు జారీ చేశామని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయుల (పాఠ్య ప్రణాళిక) లెసన్ ప్లాన్‌ను, టీచింగ్ డైరీని అడిగితే ఉపాధ్యాయులు ఎవరూ సమాచారం ఇవ్వక పోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎండి జాఫర్‌తో పాటు 12 మంది ఉపాధ్యాయులకు ఒక సంవత్సరం పాటు ఇంక్రిమెంటును ఎందుకు నిలిపి వేయకూడదని షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శంకరయ్య పాల్గొన్నారు.

సొంత బంధువే హతమార్చాడు

- కానపల్లె హత్య కేసును 24 గంటల్లో ఛేదించిన రూరల్ పోలీసులు
- వివాహేతర సంబంధమే కారణం
- ఇద్దరు నిందితుల అరెస్ట్
- వివరాలను వెల్లడించిన జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు


హత్య కేసు వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు

ప్రొద్దుటూరు క్రైం : వివాహేతర సంబంధం నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. ఈ హత్య ఘటనలో సొంత బంధువే నిందితుడు. సంచలనం సృష్టించిన కానపల్లె హత్య కేసును పోలీసులు ఛేదించారు. ప్రొద్దుటూరు మండలం కానపల్లె ఎస్సీ కాలనీలో శుక్రవారం వేకువ జామున మిద్దెపై నిద్రిస్తున్న ఆకుమల్ల నాగేంద్ర బాబును గొంతు కోసి హత్య చేసిన విషయం తెలిసిందే. మృతుడి భార్య ఇమాంబీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులోని నిందితులను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివాహేతర సంబంధమే హత్యకు కారణమని పోలీసుల విచారణలో నిర్ధారణ అయింది. అరెస్ట్ వివరాలను శనివారం సాయంత్రం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు మీడియాకు వెల్లడించారు. మృతుడు ఆకుమల్ల నాగేంద్రబాబుకు అతని సమీప బంధువు నగేష్‌లకు ఒక మహిళతో వివాహేతర సంబంధం ఉండేది. విషయం తెలియడంతో నగేష్‌ను దగ్గరికి రానివ్వద్దని నాగేంద్రబాబు మహిళను హెచ్చరించాడు. ఇంకోసారి అతన్ని రానిస్తే చంపేస్తానంటూ బెదిరించాడు. దీంతో నాగేంద్రబాబును ఎలాగైనా చంపి తమకు అడ్డు లేకుండా తొలగించుకోవాలని నగేష్ మహిళతో కలిసి కుట్ర పన్నాడు. ఈ క్రమంలో కానపల్లెలోని ఎస్సీ కాలనీలో గంటా మరియమ్మ ఇంటిపై నిద్రపోతున్న ఆకుమల్ల నాగేంద్రబాబును శుక్రవారం వేకువ జామున 4.30 గంటల సమయంలో నగేష్ కత్తితో గొంతు కోసి హత్య చేశాడు.

టెక్నాలజీ సాయంతో నిందితుల గుర్తింపు..

హత్య జరిగిన తర్వాత దర్యాప్తు కోసం సీఐలు నారాయణయాదవ్, ఇబ్రహీం, ఎస్ఐలు చిరంజీవి, శివప్రసాద్‌లతో కూడిన ప్రత్యేక టీంను జిల్లా ఎస్పీ అన్బురాజన్ నియమించారు. ఈ క్రమంలో అనుమానితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు టెక్నాలజీ ద్వారా హత్య కేసులో పురోగతి సాధించారు. ఈ కేసులోని నిందితులు నగేష్‌తో పాటు మహిళను శనివారం రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లతో పాటు హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపించనున్నట్లు డీఎస్పీ నాగరాజు తెలిపారు. ఈ కేసులో మంచి ప్రతిభ కనబరచిన పోలీసు బృందాన్ని ఎస్పీ అన్బురాజన్ అభినందించారు. కాగా హత్య కేసులోని నిందితుడు డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. సొంత బంధువే హత్య చేశాడని నిర్ధారణ కావడంతో కుటుంబ సభ్యులు, బంధువులు షాక్‌కు గురయ్యారు.

కారు ఢీకొని వృద్ధురాలి మృతి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక శివాలయం వీధిలోని శ్రీనివాసనగర్ సర్కిల్‌లో కారు కింద పడి వడ్ల వెంకటసుబ్బమ్మ (72) అనే వృద్ధురాలు మృతి చెందింది. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణంలోని ఆంధ్రకేసరి రోడ్డుకు చెందిన వడ్ల వెంకటసుబ్బమ్మ దివ్యాంగురాలు. నాలుగు చక్రాల చెక్క బండిపై కూర్చొని ఆమె రోజూ యాచక వృత్తి చేసుకునేది. ఈ క్రమంలో ఆమె శనివారం ఉదయం శ్రీనివాసనగర్ సర్కిల్‌లో ఉండగా.. శివాలయం సెంటర్ వైపు నుంచి వస్తున్న కారు డ్రైవర్ చూసుకోకుండా వెళ్లడంతో ఆమె కారు చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె కుమార్తె ఫాతిమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ పుల్లన్న తెలిపారు.

లారీ ఢీకొని..


ప్రమాద స్థలంలో బాధితుడిని బతికించేందుకు యత్నిస్తున్న యువకుడు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం టుటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని మేకలదొడ్డి వద్ద వేగంగా వచ్చిన లారీ ఓ యువకుడిని ఢీకొనడంతో దుర్మరణం చెందినట్లు టుటౌన్ ఎస్ఐ సంజీవరాయుడు తెలిపారు. ఎస్ఐ కథనంమేరకు..కడప సాయిపేటకు చెందిన ఆరీఫ్‌బాషా (29) మార్కెటింగ్ విభాగంలో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. శనివారం ఉదయం ద్విచక్ర వాహనంలో ఇంటి నుంచి వెళుతుండగా ఎదురుగా వచ్చిన లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ఆరీఫ్‌బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పర్మినెంట్ లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి అన్నపూర్ణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అన్నపూర్ణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : పర్మినెంట్ లోక్ అదాలత్ (పీఎల్ఏ) ద్వారా ఫిర్యాదుదారులు ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.అన్నపూర్ణ పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్ భవనంలో శాశ్వత లోక్ అదాలత్ ఆధ్వర్యంలో పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఎస్.ప్రసాద్ అధ్యక్షతన ప్రజా ప్రయోజిత సేవా రంగాల్లో న్యాయ సేవలపై పారా లీగల్ వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్మినెంట్ లోక్ అదాలత్ అందించే తీర్పు భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పుతో సమానమన్నారు. పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ఈ తీర్పుకు ఎలాంటి అప్పీలు లేదన్నారు. ప్రజా ప్రయోజిత సేవల్లో లోపం, పరిహారం కోసం దావా, సొమ్ము వసూలు పర్మినెంట్ లోక్ అదాలత్ నినాదమన్నారు. ప్రజా ప్రయోజిత సేవలలో లోపాలతో కలిగే నష్టాలపై వచ్చే ఫిర్యాదులకు సంబంధిత ప్రజా ప్రయోజిత శాఖల అధికారులు ఎలా స్పందించాలి? జాతీయ లోక్ అదాలత్‌కు, పర్మినెంట్ లోక్ అదాలత్‌కుగల వ్యత్యాసం తదితర అనేక అంశాలపై అవగాహన కల్పించారు. డీఎల్ఎస్ఏ సెక్రటరీ కవిత మాట్లాడుతూ సాధారణ లోక్ అదాలత్‌లో ఇప్పటికే ఎన్నో కేసులను పరిష్కరించామన్నారు. పూర్తి వివరాలకు జిల్లా కోర్టు ఆవరణలోని పర్మినెంట్ లోక్ అదాలత్ కార్యాలయంలో లేదా 86396 84279, 99637 31698 నంబరుకు కాల్ చేసి చట్టాలపై సరైన అవగాహన పొందవచ్చన్నారు.

ఊయల చీర మెడకు చుట్టుకొని యువకుడు మృతి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక బాలాజీనగర్‌లో ఊయల చీర ప్రమాదవశాత్తు మెడకు చుట్టుకొని ప్రశాంత్ (29) అనే యువకుడు మృతి చెందాడు. టూ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. ప్రశాంత్ పైపుల దుకాణంలో కలెక్షన్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. అతనికి మద్యం సేవించే అలవాటు ఉంది. వివాహం కాలేదు. తల్లి ప్రసన్నతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం అతను మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో తల్లి బయట ఉంది. అతను ఇంట్లో చీరతో వేసిన ఊయల్లో కూర్చున్నాడు. చీరను పురి తిప్పడంతో అతని మెడకు బిగుసుకొని పోయింది. దీంతో ఊపిరాడక మృతి చెందాడు. తల్లి వచ్చి చూసే సరికి అప్పటికే శ్వాస ఆగిపోయింది. మృతుడి సోదరుడు శిరీష్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ ఇబ్రహీం తెలిపారు.

ఎరువుల దుకాణాలపై దాడులు


తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

వేంపల్లె : వేంపల్లె పట్టణంలో ఉన్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాలకు సంబంధించి ప్రైవేటు డీలర్ల షాపులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, మండల వ్యవసాయాధికారి రాజేంద్రప్రసాద్ శనివారం దాడులు నిర్వహించారు. అనంతరం స్టాక్ రిజిష్టర్స్, బిల్ బుక్స్, భౌతిక నిల్వలను పరిశీలించారు. నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న తేజ ఫర్టిలైజర్స్‌లో 10:26:26 మహాదాన్ కంపెనీకి చెందిన రసాయనిక ఎరువులు రూ. 2,35,250 విలువగల ఎరువుల అమ్మకాన్ని నిలుపుదల చేశారు. అలాగే వెంకట రమణ ఫర్టిలైజర్స్‌లో రసాయనిక ఎరువుల నిల్వలకు సంబంధించి రికార్డులు లేనందున రూ. 2,97,412 విలువజేసే ఎరువులపై సెక్షన్ 6ఏ ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా దుకాణదారులు నకిలీ ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయిస్తున్నట్లయితే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. అలాంటి దుకాణాలను సీజ్ చేయడమేగాక క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

ఉద్యోగం రాలేదని యువతి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం : తన స్నేహితులకు ఉద్యోగం వచ్చినా క్యాంపస్ సెలక్షన్‌లో తనకు ఉద్యోగం రాలేదని మనస్తాపంతో శాంతకుమారి వీధికి చెందిన బల్లాని చంద్రకళ (21) అనే యువతి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. సుజాత, రామచంద్ర దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వారిలో చిన్న కుమార్తె చంద్రకళ స్థానికంగా ఉన్న ఒక ప్రైవేట్ కళాశాలలో ఇటీవల డిగ్రీ పూర్తి చేసింది. యువతి తండ్రి రామచంద్ర పుల్లంపేట ప్రభుత్వ పాఠశాలలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల చంద్రకళ పరీక్షలు ముగిశాయి. కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్లలో ఆమె స్నేహితురాళ్లు వివిధ కంపెనీల తరఫున ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కానీ చంద్రకళకు ఉద్యోగం రాలేదు. దీంతో ఆమె మథన పడుతుండగా తల్లిదండ్రులు సముదాయించేవారు. ఈ క్రమంలో శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చంద్రకళ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలపారు.

గేదెలను తప్పించబోయి లారీ బోల్తా


బైపాస్ సమీపంలో బోల్తా పడిన లారీ

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరుకు శనగబేడల లోడుతో వెళుతున్న లారీ జమ్మలమడుగు బైపాస్ రోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న గేదెలను తప్పించబోయి బోల్తా పడింది. ఈ సంఘటనలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం లారీని జేసీబీ సాయంతో పైకి లేపారు.

నేడు ఆర్‌ఎం కిసాన్ సెంటర్ ప్రారంభం

కడప సెవెన్‌రోడ్స్ : వీరపునాయునిపల్లె మండలం ఎన్.పాలగిరి గ్రామంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆర్‌ఎం కిసాన్ సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రారంభిస్తున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఇ.రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కిసాన్ సెంటర్‌ను ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి రైతులకు అంకితమివ్వనున్నారని తెలిపారు. అన్ని పంటలకు సంబంధించిన నూతన విదేశీ పరిజ్ఞానాన్ని ప్రత్యక్ష పద్ధతిలో క్షేత్ర స్థాయిలో తమ సంస్థ రైతులకు పరిచయం చేయనుందని చెప్పారు. అలాగే రైతులకు ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. ఉచిత శిక్షణతోపాటు నీరు, భూసార పరీక్షలు కూడా చేపడతామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కలెక్టర్ విజయరామరాజు హాజరు కానున్నారని వివరించారు.

గండి శాశ్వత నిత్యాన్నదానానికి రు.లక్ష వితరణ

చక్రాయపేట : గండి పుణ్యక్షేత్రంలోని వీరాంజనేయ స్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం రు.1,00,116లు విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన నందం జ్యువెలర్స్ యజమాని నందం జయరాం, ఆయన సతీమణి అరుణ కుటుంబ సమేతంగా వచ్చి విరాళం అందజేశారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్ దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రాణించిన కర్నూలు బ్యాట్స్‌మన్

డబుల్ సెంచరీ సాధించిన సూర్యతేజారెడ్డి


తలపడుతున్న కడప, చిత్తూరు జట్లు


సాయిసూర్యతేజారెడ్డి (డబుల్ సెంచరీ)


అస్లాం, కడప (4 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్-19 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా నిర్వహిస్తున్న మ్యాచ్‌లో కర్నూలు బ్యాట్స్‌మన్ రాణించారు. శనివారం కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 77.4 ఓవర్లలో కర్నూలు జట్టు 395 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఎ. సాయిసూర్య తేజారెడ్డి 196 బంతుల్లో 26 ఫోర్లు, 5 సిక్సర్లతో 201 పరుగులు చేశాడు. ఈయనకు జతగా బి. ధనుష్‌నాయుడు 61 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్లు సుతేజ్‌రెడ్డి 3, భార్గవ్‌మహేష్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 5 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 17 పరుగులు చేసింది. జట్టులోని మొనీష్ 11 పరుగులతో క్రీజులో ఉన్నాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానంలో..

వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో కడప, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 88.5 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 279 పరుగుల వద్ద చిత్తూరు జట్టు డిక్లేర్ చేసింది. జట్టులోని బాలాజీ 49 పరుగులు, లోహిత్ లక్ష్మినారాయణ 45 పరుగులు చేశాడు. కడప బౌలర్లు అస్లాం 4, సాయిఆర్థిత్‌రెడ్డి 4 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 1 ఓవర్లో వికెట్ నష్టపోకుండా 2 పరుగులు చేసింది. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

విద్యార్థిని మందలించిన ఉపాధ్యాయురాలు


విద్యార్థిని తల్లి, ఉపాధ్యాయురాలు ఘర్షణ పడుతున్న దృశ్యం


ఉపాధ్యాయురాలికి మద్దతుగా బైఠాయించిన విద్యార్థినులు

- విద్యార్థిని తల్లి, టీచర్ మధ్య పాఠశాల ఆవరణలో ఘర్షణ
- త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఉపాధ్యాయురాలు ఓ విద్యార్థిని మందలించిన ఘటన చినికి చినికి గాలివానగా మారి చివరకు ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లి ఘర్షణ పడేంత వరకు వెళ్లింది. ప్రొద్దుటూరులోని వైవీఎస్ మున్సిపల్ బాలికల పాఠశాలలో కె.ప్రియ కుమార్తె 9వ తరగతి చదువుతోంది. శుక్రవారం ఆ విద్యార్థిని వద్ద లెటర్ ఉందని తోటి విద్యార్థులు గమనించి ఉపాధ్యాయులకు ఇచ్చారు. వారు ఆ లెటర్‌ను ప్రధానోపాధ్యాయుడు కాశీ ప్రసాద్ రెడ్డికి ఇచ్చారు. ఆయన ఆ విద్యార్థిని తల్లిని పాఠశాలకు పిలిపించి మాట్లాడారు. శనివారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థిని టీచర్‌ను ఉద్దేశించి పరుషంగా మాట్లాడిందంటూ విద్యార్థినులు ఉపాధ్యాయురాలు సునందకు చెప్పడంతో ఆమె విద్యార్థిని మందలించారు. దీంతో ఆ బాలిక తల్లికి ఫోన్ చేసి పాఠశాలకు రావాలని కోరింది. ప్రధానోపాధ్యాయుడు కాశీప్రసాదరెడ్డి విచారిస్తుండగానే విద్యార్థిని తల్లి, ఉపాధ్యాయురాలి మధ్య వాగ్వాదం తీవ్రమై పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ సమయంలో కొందరు విద్యార్థులు తమ పాఠశాల ఉపాధ్యాయురాలిపై అకారణంగా దాడికి పాల్పడ్డారంటూ పాఠశాల ఆవరణలో బైఠాయించారు. అక్కడకు చేరుకున్న ఎంఈఓ సావిత్రమ్మ విద్యార్థిని తల్లిని విచారించి రాత పూర్వకంగా ఫిర్యాదు స్వీకరించారు. జరిగిన సంఘటనను డీఈఓ రాఘవరెడ్డికి వివరించారు. అనంతరం ఉపాధ్యాయురాలు సునంద తోటి ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థిని తల్లి తనపై దాడి చేసిందని, చర్యలు తీసుకోవాలని త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యార్థిని తల్లి ప్రియ కూడా తమ బిడ్డను ఇబ్బంది పెడుతున్న ఉపాధ్యాయులు సునంద, వెంకటలక్ష్మి, గీతలను సస్పెండ్ చేయాలని ఎంఈఓకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై ఉపాధ్యాయురాలు సునంద మాట్లాడుతూ విద్యార్థిని తాను మందలిస్తే తనను నోటికొచ్చినట్లు మాట్లాడటమే కాకుండా తనపై దాడి చేసిందని తెలిపారు. విద్యార్థిని తల్లి తనను చంపుతానని పాఠశాలలో అందరి ముందే బెదిరించిందని ఆమెపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఉపాధ్యాయురాలు బదిలీ

జరిగిన సంఘటనపై స్పందించిన డీఈఓ రాఘవరెడ్డి ఉపాధ్యాయురాలు సునందను ప్రొద్దుటూరులోని రెండో వార్డు మున్సిపల్ హైస్కూల్‌కు డిప్యుటేషన్‌పై బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తి విచారణ తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నకిలీ విలేకరిపై కేసు నమోదు

కొండాపురం : నకిలీ విలేకరిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు ఎస్. తిమ్మాపురం గ్రామానికి చెందిన మంజుల శ్రీనివాసులు అనే వ్యక్తి గత కొంతకాలంగా తాను విలేకరి అని చెప్పి విద్యుత్ శాఖ అధికారులను బెదిరిస్తున్నాడు. ఈ విషయం పై పోలీసులు విచారణ చేపట్టి అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి కేసు నమోదు చేశారు. అనంతరం మండల తహసీల్దార్ శోభన్‌బాబు ఎదుట బైండోవర్ చేశామన్నారు.